క్లుప్తంగా

నివాళులు



సుజాతమ్మ మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బలరాం, అభ్యర్థి వెంకటేష్

చీరాల: మాజీ కౌన్సిలర్ కూరపాటి స్టాలిన్ భార్య సుజాతమ్మ అనారోగ్యంతో బుధవారం మరణించారు. విషయం తెలుసుకున్న చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, వైఎస్సార్ సీపీ చీరాల అసెంబ్లీ అభ్యర్థి కరణం వెంకటేష్‌లు స్టాలిన్‌ను పరామర్శించి సుజాతమ్మ మృతదేహానికి నివాళులర్పించి ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ జైసన్‌బాబు, మున్సిపల్ కౌన్సిలర్లు, పలు పార్టీల నాయకులు, మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

బాలాజీ గెలుపు కోసం జోరుగా ప్రచారం



మార్టూరు: పర్చూరు వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి యడం బాలాజీ గెలుపు కోసం బుధవారం మండల నాయకులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. స్థానిక గొట్టిపాటి హనుమంతరావు కాలనీలో నాయకులు ఇంటింటికీ తిరుగుతూ గత ఐదేళ్లుగా ప్రభుత్వం ప్రజలకు అందించిన సంక్షేమ పథకాల వివరాలతో కూడిన కరపత్రాలను పంచుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై ఓటు వేసి బాలాజిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వారు కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పఠాన్ కాలేషావలి, మార్టూరు ఉప సర్పంచ్ కాకోలు రామారావు, కాలనీ వార్డు నంబరు పఠాన్ కాశీం, అట్లూరి సుకుందరావు, గడ్డం మస్తాన్ వలి, రాజా నాయక్, అడకా గంగయ్య, చిమ్మిరిబండ శ్రీను, సులేమాన్, మోషే నాయక్, తదితరులు పాల్గొన్నారు.

నేడు బీఎస్పీ అభ్యర్థి నామినేషన్



మార్టూరు: పర్చూరు నియోజకవర్గ బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థిగా మార్టూరుకు చెందిన తమ్ములూరి వెంకటరత్నం నేడు గురువారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు పర్చూరులో నామినేషన్ దాఖలు చేయనున్న సందర్భంగా నియోజకవర్గంలోని పార్టీ కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొనాలని నియోజకవర్గ బీఎస్పీ ఇన్‌చార్జి తమ్ములూరి వెంకయ్య పిలుపునిచ్చారు.

నామినేషన్లకు ఏర్పాట్లు పూర్తి

చీరాల టౌన్: ఎన్నికల నోటిఫికేషన్ గురువారం విడుదల చేస్తున్నామని నియోజకవర్గ ఎన్నికల అధికారి, ఆర్డీవో జి.సూర్యనారాయణరెడ్డి తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్వో మాట్లాడుతూ ఈనెల 18 నుంచి 25 వరకు నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. 25 తేదీ నామినేషన్ల చివరి రోజు, 26 తేదీ నామినేషన్ల పరిశీలన, 29న నామినేషన్ల ఉపసంహరణల ప్రక్రియ పూర్తి చేసిన అనంతరం అభ్యర్థులకు గుర్తులు కేటాయింపులు చేస్తామని ఆర్వో తెలిపారు.



కొప్పరపాలెంలో ఆశీస్సులు పొందుతున్న అద్దంకి అసెంబ్లీ అభ్యర్థి చిన హనిమిరెడ్డి



శింగరకొండ ప్రసన్నాంజనేయ దేవస్థానంలో సీతారాముల కల్యాణోత్సవం



ఆణుమల్లిపేటలోని మహాలక్ష్మమ్మ మందిరం వద్ద సీతారామ కల్యాణ మహోత్సవం

రమణీయం రాములోరి కల్యాణం

- జైశ్రీరామ్.. జైశ్రీరామ్ నామస్మరణతో మార్మోగిన ఆలయాలు
- వాడవాడలా శ్రీరామనవమి
- వేడుకలా సీతారాముల కల్యాణం



పంగులూరు: అలంకరణలో సీతారామలక్ష్మణుల విగ్రహాలు



చినగంజాం భావన్నారాయణ స్వామి అలయంలో కల్యాణం నిర్వహిస్తున్న భక్తులు



శింగరకొండ కల్యాణోత్సవం తిలకిస్తున్న భక్తులు



స్వర్ణలో కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు



స్వర్ణలో కల్యాణం జరిపిస్తున్న దంపతులు



ఉప్పలపాడులో పూజలు చేసిన వెంకారెడ్డి దంపతులు



చీరాల: రాములోరి కల్యాణంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

కారంచేడు/చినగంజాం/మార్టూరు/యద్దనపూడి: నీలమేఘశ్యాముడు.. సకల గుణాభిరాముడు శ్రీరాముడు. మిథిలా నగర యువరాణి జానకిల వివాహ మహోత్సవం బుధవారం అత్యంత వైభవంగా జరిగింది. శ్రీరామనవమి వేడుకలను యద్దనపూడి మండలంలో భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండలంలోని అనంతవరం, పూనూరు, గన్నవరం, చింతపల్లిపాడు, పోలూరు, జాగర్లమూడి గ్రామాల్లోని వీధుల్లో చలవపందిళ్లను ఏర్పాటు చేసి అందులో సీతారాముల ప్రతిమలను ఉంచి రాములోరి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈకల్యాణ మహోత్సవంలో వేదపండితుల మంత్రోచ్ఛరణలు, సుమంగళ వాయిద్యాలు, భక్తుల జయ జయ ధ్వానాల మధ్య మాంగల్యధారణ రమణీయంగా సాగగా తలంబ్రాల వేడుక పరమానందంగా జరిగింది. ఈస్వామివారి కల్యాణాన్ని నూతన దంపతులు పీటలపై కూర్చొని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులతో గ్రామోత్సవం నిర్వహించారు.

■ కారంచేడు పంచాయతీ కార్యాలయం వద్ద సీతారామాలయం సమీపంలో ఏర్పాటు చేసిన చలువ పందిరిలో కల్యాణం వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అర్చకస్వాములు కేశవాచార్యులు, రమణాచార్యులు తీర్థప్రసాదాలను అందించారు. గ్రామానికి చెందిన కొంత మంది దంపతులు కల్యాణం నిర్వహించారు. మండలంలోని స్వర్ణలో నడిగడ్డలో ఏర్పాటు చేసిన పందిరిలో కల్యాణం జరిపించారు. కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలోను, ఉత్తర బజారులోను, పాలెంలోను సీతారాముల కల్యాణం జరిపించారు. మొదట సీతారాముల ఉత్సవ విగ్రహాలను, పసుపు, కుంకుమ, పట్టు వస్త్రాలు, తాళిబొట్టులను గ్రామంలో మేళతాళాలతో ఊరేగించారు. అనంతరం శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించి తలంబ్రాలను పోశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులకు ఆలయ అర్చకులు ఏవీఎస్ శాస్త్రి తీర్థ, ప్రసాదాలను పంపిణీ చేశారు.

■ శ్రీరామనవమి సందర్భంగా మార్టూరు మండలంలో ప్రజలు బుధవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. పలు గ్రామాల్లో ప్రజలు వీధులలోని కూడళ్ల వద్ద చలువ పందిళ్లు ఏర్పాటు చేసి సీతారాముల కళ్యాణం ఘనంగా చేశారు. మార్టూరు, ద్రోణాదుల, కోలలపూడి, రాజుపాలెం తదితర గ్రామాలలోని రామాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీరామనవమి సందర్భంగా కోలలపూడి గ్రామంలోని రామాలయం వద్ద నేడు భక్తులకు అన్నదానం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

కన్నుల పండువగా రాములోరి పెళ్లి సందడి..

వేటపాలెం: మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో రామాలయాల వద్ద గల ప్రాంగణాల్లో శ్రీరామ నవమి పండుగను పురస్కరించుకొని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చలువ పందిళ్లలో రాములోరి పెళ్లి సందడి కన్నుల పండువగా బుధవారం నిర్వహించారు. స్థానిక గడియార స్తంభం సెంటర్‌లో రామమందిరం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక పందిరిలో రాములవారి కళ్యాణ వేదపండితులు కన్నుల పండువగా నిర్వహించారు. స్థానిక మహాలక్ష్మమ్మ చెట్టు వద్దగల అమ్మవారి దేవస్థానం ఏర్పాటు చేసిన ప్రత్యేక పందిరిలో స్వామి వారి కల్యాణం నిర్వహించారు. అనంతరం వడపప్పు, పానకం పంచిపెట్టారు. కన్యకా పరమేశ్వరి దేవస్థానం, ఆణుమల్లిపేటలో గల మహాలక్ష్మమ్మ మందిరం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక పందిరిలో కల్యాణం వైభవంగా నిర్వహించారు. పందిళ్లపల్లి, దేశాయిపేట, బొచ్చులవారిపాలెం, కఠారివారిపాలెం, కొత్తరెడ్డిపాలెం, రామానగర్, సర్వోదయ కాలనీలో సీతారామ కల్యాణ మహోత్సవం వైభంగా నిర్వహించారు.

చీరాల టౌన్: శ్రీరామనవమి సందర్భంగా బుధవారం చీరాల పట్టణ, రూరల్ గ్రామాల్లో వాడ వాడలో శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శ్రీరామనవమి పండుగ సందర్భంగా పలు ప్రాంతాల్లో రాములోరి కల్యాణానికి చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు. పట్టణంలోని వీరరాఘవపేట, బెస్తపాలెం, కొట్లబజారు. పట్టాభి స్వీట్స్ సమీపంలో, రామమందిరం వద్ద, పలు దేవాలయాలతో పాటుగా చలువ పందిళ్లల్లో కల్యాణాన్ని శాస్త్రోత్తంగా నిర్వహించారు. సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని పండితుల మంత్రోచ్ఛరణలతో వైభవంగా నిర్వహించారు ముందుగా సీతారాముల చిత్రపటాలను మేళతాళాలతో ఘనంగా ఊరేగించారు.

ప్రత్యేక పూజలు చేసిన అసెంబ్లీ అభ్యర్థి హనిమిరెడ్డి..

మేదరమెట్ల/అద్దంకి/బల్లికురవ/అద్దంకి రూరల్/జే.పంగులూరు: శ్రీరామనవమి పండుగను కొరిశపాడు మండలంలోని ప్రజానీకం ఎంతో భక్తిశ్రద్ధలతో బుధవారం నిర్వహించారు. మేదరమెట్ల తూర్పుపాలెంలోని కోదండరామస్వామి దేవస్థానంలో సీతారాముల కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు జైశ్రీరామ్, జైశ్రీరామ్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు కల్యాణ వేడుక అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలి..

జగదభిరాముడి ఆశీస్సులతో గ్రామాల్లోని రైతులు వ్యాపారులు పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలని అద్దంకి వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డి అన్నారు. శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా బుధవారం మండలంలోని కొప్పరపాలెం గ్రామంలోని కోదండరామాలయంలో జరిగిన కల్యాణోత్సవంలో హనిమిరెడ్డి పాల్గొన్నారు. వేడుకల్లో భాగంగా స్వామి అమ్మవార్ల ఆశీస్సులు పొందారు. అర్చకులు వేద ఆశీర్వచనంతో పాటు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయం వద్ద జరిగినన్న సంతర్పణ కార్యక్రమంలో హనిమిరెడ్డి ప్రతిఒక్కరిని పలకరించారు. ఈయన వెంటగ్రామ సర్పంచ్ వీ. అమల అంజిరెడ్డి, స్థానిక నేతలు మేకల అంజిరెడ్డి, గన్నమనేని వెంకట రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. చెన్నుపల్లి గ్రామంలోని సీతారామస్వామి ఆలయంలో అర్చకులు పీ. సుబ్రహ్మణ్యశర్మచే స్వామి అమ్మవార్లకు ఎదర్కోలా, కల్యాణోత్సవం అనంతరం సాయంత్రం గ్రామోత్సవం చేపట్టారు. కొత్తపాలెం గ్రామంలోని కోదండరామాలయంలో అర్చకులు ఐనవోలు సుబ్బాచార్యులచే స్వామిమ్మవార్లను ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన మందిరంపై ఉంచి కల్యాణోత్సవం చేపట్టారు. గ్రామంలోని చల్లగుళ్ల వంశస్థులచే అన్న సంతర్పణ చేశారు.

■ జే.పంగులూరు అంబేడ్కర్ కాలనీలోని రామ మందిరంలో వేద పండితులు మంత్రోచ్ఛరణ మధ్య స్వామి వారి కల్యాణం నిర్వహించారు. ఈ కల్యాణాన్ని భక్తులు వీక్షించేందుకు భక్తులను ఎక్కువ సంఖ్యలో హాజరయ్యారు. పంగులూరు భీమలింగేశ్వర దేవాలయం ప్రాంగణంలో స్వామి వారి కల్యాణాన్ని భక్తులు నిర్వహించారు.

■ ప్రముఖ పుణ్యక్షేత్రమైన శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం వద్ద, రామాలయంలో స్వామి అమ్మవార్ల కల్యాణాన్ని నిర్వహించారు. అద్దంకిలోని స్థానిక శ్రీరామబజారులో, గాంధీబొమ్మ సెంటర్, అత్తులూరి వారివీధిలో పలు చోట్ల పందిళ్ల వేసి దంపతులు పీటలపై కూర్చొని సీతారామ స్వామి కల్యాణాన్ని నిర్వహించారు.

సీతారామలక్ష్మణ పురాతన నాణేల ప్రదర్శన..

పర్చూరు (చినగంజాం): శ్రీరామ నవమి సందర్భంగా మండలంలోని పలు దేవాలయాలలో సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. బుధవారం నూతలపాడులో, ఉప్పుటూరులోని కోనేరు వీరాంజనేయస్వామి దేవస్థానం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ఆలయంలో నిర్వహించిన సీతారాముల కల్యాణ మహోత్సవానికి వేలాది మంది భక్తులు తరలి వచ్చారు. ఆదిపూడి గ్రామానికి చెందిన పాత నాణేల సేకరణ కర్త కాల్వ రఘురామయ్య శ్రీరాముడి పట్టాభిషేకానికి సంబంధించిన నాణాలు ఆలయంలో ప్రదర్శించారు. 1818లో ముద్రించిన శ్రీరాముడు ఆంజనేయ స్వామికి చెందిన పలు రకాల పురాతన నాణాలను ప్రదర్శించడంతో భక్తులు అమితానందం పొందారు. కార్యక్రమంలో అర్చకులు కారంచేటి పిచ్చయ్య శాస్త్రి, బృందావనం వెంకట రమణాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

■ చినగంజాం మండలంలో సోపిరాల రామాలయం, చినగంజాం భూసమేత భావన్నారాయణ స్వామి ఆలయంలో పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. భావన్నారాయణ స్వామి ఆలయంలో ఆలయ అర్చకులు అళహరి మోహన లక్ష్మీ నరసింహాచార్యులు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించగా వలివేటి రామానుజం దంపతులతో పాటు గ్రామంలో పలువురు భార్యభర్తలు పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. పల్లెపాలెం గ్రామంలో గ్రామ కాపు దండుప్రోలు తిరుమలరావు ధర్మపత్ని నాగేంద్రంలు సీతారాముల కల్యాణ మహోత్సవం నిర్వహించారు.



చీరాల: సీతారామలక్ష్మణ విగ్రహాలకు గ్రామోత్సవం చేస్తున్న భక్తులు



చెన్నుపల్లిలో స్వామి అమ్మవార్లకు ఎదుర్కోల..



కోలలపూడి రామాలయంలో సీతారాముల కల్యాణంలో పాల్గొన్న భక్తులు



ఉప్పుటూరులో సీతారామ కల్యాణం నిర్వహిస్తున్న భక్తులు



పూనూరులో ఉత్సవమూర్తులతో గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

హనిమిరెడ్డికి వలంటీర్ల సంఘీభావం



అద్దంకి అసెంబ్లీ అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డిని కలిసిన వలంటీర్లు

అద్దం రూరల్: అద్దంకి పట్టణంలోని 5వార్డుకు చెందిన ఐదుగురు వలంటీర్లు, నాగులపాడు గ్రామానికి చెందిన 9 మంది వలంటీర్లు రాజీనామా చేసి బుధవారం రాత్రి పార్టీ కార్యాలయంలో అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డిని కలిసి సంఘీభావం తెలిపారు. మండలంలోని వేలమూరిపాడు గ్రామానికి చెందిన నలుగురు వలంటీర్లు రాజీనామా చేశారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ నాయకుడు నరసింహారెడ్డిని కలిసి అసెంబ్లీ అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డికి సంఘీభావం తెలిపారు. వీరి వెంట వేలమూరిపాడు కన్వీనర్ గోపనబోయిన శ్రీనివాసరావు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.



నరసింహారెడ్డిని కలిసి సంఘీభావం తెలుపుతున్న వేలమూరి వలంటీర్లు

వెంకటేష్‌కు మద్దతు తెలిపిన టీడీపీ నాయకులు



అసెంబ్లీ అభ్యర్థి కరణం వెంకటేష్‌కు మద్దతు తెలుపుతున్న శ్రీనివాసరావు

వేటపాలెం: దేశాయిపేటకు చెందిన టీడీపీ నాయకుడు బూసం శ్రీనివాసరావు వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి కరణం వెంకటేష్ సమక్షంలో సంపూర్ణ మద్దతు బుధవారం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను పార్టీ గెలుపు కోసం కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ చిమటా సాంబు, మాజీ ఎంపీపీ చల్లా జనార్ధనరావు, మాజీ సర్పంచ్ లేళ్ల శ్రీధర్, కర్ణ లక్ష్మారావు, విశ్రాంత కార్యదర్శి ఆవులు పున్నయ్య ఉన్నారు. శ్రీరామ నవమి సందర్భంగా రామన్నపేట పంచాయతీ రావూరి పేటలోని మాజీ సర్పంచ్ బట్టా అనంతలక్ష్మీ, బట్టా లీలానంద ప్రసాద్ ఆహ్వానం మేరకు వారి నివాసంలో ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, వెంకటేష్ ఆత్మీయ విందుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా బట్టా లీలానంద ప్రసాద్ కరణం వెంకటేష్ గెలుపు కోసం కృషిచేస్తామని హామీ ఇచ్చారు. వీరి వెంట ఆర్‌బీకే చైర్మన్ పల్లపోలు శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, గవిని శ్రీనివాసరావు ఉన్నారు.



మాజీ సర్పంచ్ బట్టా అనంతలక్ష్మి నివాసంలో కరణం బలరాం, కరణం వెంకటేష్

ఎల్లో మీడియాలో అసత్య ప్రచారం తగదు



జజ్జర ఆనందరావు

మేదరమెట్ల: ఎల్లో మీడియాను అడ్డుపెట్టుకొని టీడీపీ నేతలు అసత్య కథనాలను రాయిస్తున్నారని మేదరమెట్ల మాజీ సర్పంచ్ జజ్జర ఆనందరావు ఒక ప్రకటనలో విమర్శించారు. ఎన్నికల సమయంలో అనుమానాస్పదంగా నగదు ఉందనే సమాచారంతో పోలీసులు సోదాలు నిర్వహించి దొరికిన సొమ్మును స్వాధీనం చేసుకుంటే అది సరికాదని ఎల్లో మీడియాలో రాయించడం ఎంతవరకు సమంజసం అని జజ్జర ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో అధికారులు ఎలక్షన్ కమిషన్ ఆధీనంలో ఉంటారని, అందులో భాగంగానే వారు విధులు నిర్వహిస్తారనే కనీస అవగాహన లేని ఎల్లో మీడియా ఇలాంటి తప్పుడు కథనాలను ఎలా రాస్తుందని వాటిని ప్రజలు ఎలా నమ్ముతారని ప్రశ్నించారు. ఈసారి ఎన్నికల్లో గెలవలేమని భావించిన టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి ఎల్లో మీడియాను అడ్డుపెట్టుకొని ఇలాంటి అసత్య కథనాలను రాయిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి అవాస్తవమైన కథనాలను ఇకనైనా మానుకోవాలని ఆయన అన్నారు. రాజ్యసభ సభ్యుడు వైవీసుబ్బారెడ్డి 2004 నుంచి మేదరమెట్ల గ్రామానికి కోట్ల రూపాయలను ఖర్చు పెట్టి అభివృద్ధి చేశారన్నారు. కార్యక్రమాలను చేయడంతో పాటు పార్టీలకు అతీతంగా ఎవరు వచ్చి ఏలాంటి సమస్య ఉన్న పని అడిగినా కాదనకుండా వారికి పరిష్కారం చేసి పంపించామన్నారు. తప్పుడు కథనాలు రాయించేవారికి సరైన బుద్ధి చెప్పేందుకు నియోజకవర్గం ప్రజానీకం సిద్ధంగా ఉన్నారన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ నాయకులు



వైఎస్సార్ సీపీలో చేరిన పంగులూరు టీడీపీ నాయకులు



పార్టీలో చేరిన సజ్జాపురం ఎస్సీ కాలనీ వాసులు

జే.పంగులూరు: రాష్ట్రంలో జగనన్న సుపరిపాలన నచ్చి ఎక్కువ మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ఓటర్లు వైఎస్సార్ సీపీలో సంతోషంగా చేరుతున్నారని అద్దంకి వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డి అన్నారు. మండల పరిధిలోని పంగులూరు గ్రామంలోని యాదవుల కాలనీకి చెందిన 10 కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరారు. మండల కన్వీనర్ స్వయంపు హనుమంతురావు సమక్షంలో చేరగా వారికి చిన హనిమిరెడ్డి పార్టీ కండువా వేశారు. పార్టీలోకి చేరిన వారిలో జంపు శేషయ్య, వెంకట్రావు, శ్రీనివాసరావు, ఏడుకొండలు, కోటయ్య, నాగరాజు, ఆవుల మంద హనుమంతురావు, ఏజర్ల శ్రీనిసరావు, రామకృష్ణ, సుబ్బయ్య తదితరలు చేరారు.

సంతమాగులూరు (అద్దంకి): మండలంలోని సజ్జాపురం గ్రామం ఎస్సీ కాలనికి చెందిన 10 కుటుంబాలలు టీడీపీని వీడి బుధవారం మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కైపు మహేష్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరందరికి మహేష్‌రెడ్డి పార్టీ కండువాలు ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

హనిమిరెడ్డికి రోజురోజుకూ పెరుగుతున్న గ్రాఫ్



ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న మహేష్‌రెడ్డి

సంతమాగులూరు (అద్దంకి రూరల్): అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థికి ప్రజల్లో గ్రాఫ్ పెరుగుతోందని సంతమాగులూ మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ కైపు మహేష్‌రెడ్డి అన్నారు. బుధవారం రాత్రి మండలంలోని సజ్జాపురం గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలో గడపగడపకు తిరుగుతూ జగనన్న ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. రానున్న ఎన్నికల్లో అసెంబ్లీ అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డికి, ఎంపీ అభ్యర్థి నందిగం సురేష్‌కు ఫ్యాన్ గుర్తుపై రెండు సార్లు బటన్‌నొక్కి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ, మండల నాయకులు పాల్గొన్నారు.

48 మద్యం బాటిళ్లు స్వాధీనం

మార్టూరు: మండల కేంద్రం మార్టూరులో బుధవారం సాయంత్రం అక్రమంగా మద్యం తరలిస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని నుంచి 48 మద్యం బాటిళ్లు స్వాధీనం సీఐ రాజశేఖరరెడ్డి తెలిపారు. ఏఎస్సై సైదా, కానిస్టేబుల్ కోటేశ్వరరావులు స్థానిక కొనిదెన రోడ్డులో అద్దంకి మండలం చిన్న కొత్తపల్లి గ్రామానికి చెందిన కోనంకి అంజయ్య అదుపులోకి తీసుకున్నారు. మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని అతనిని స్టేషన్‌కు తరలించారు. కేసు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.